నేటి కందం- నేటికి అందం

గవుహతి టీట్వంటీలో
ప్రవిమలముగ ప్రతిభ జూపి భారత దేశం
బవలీల న్యూజిలాండును
బవరములో నోడగొట్టి బహుమతి నొందెన్ !!

(గవుహతి టీట్వంటీ సిరీస్ లో భారత్ న్యూజిలాండ్ ను ఓడించింది..)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

ప్రజాస్వామ్య గణతంత్రం
పరిఢవిల్లుతుంటది
ధనిక బీద అంతరాల్లో
దినం కుములుతుంటది
రాజ్యాంగం గొప్ప నీతి
రోజు చాటుతుంటది
పాలకుల గుప్పిట్లో
పడి నలుగుతుంటది

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 27-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:140 పేజీలు:6 వెల: రూ.1/-


## అట్టహాసంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

### -జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూ డిల్లీ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశ రాజధాని ఢిల్లీలో ఘనంగా 77వ గణతంత్ర వేడుకలు అట్టహాసంగా కొనసాగాయి ."వందేమాతరానికి 150 ఏళ్లు'' ప్రధాన ఇతివృత్తంతో వేడుకలు నిర్వహించారు.. ఉదయం 10.30 గంటలకు కర్తవ్యపథ్‌లో వేడుకలు ప్రారంభం కాగా.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భద్రతాబలగాల గౌరవవందనం స్వీకరించారు.జెండా ఆవిష్కరణ అనంతరం పరేడ్ ప్రారంభమైంది. 6050 మంది సైనికులతో ఈ పరేడ్ నిర్వహించారు. ఇందులో



17 రాష్ట్రాలు, 13 కేంద్ర ప్రభుత్వ శకటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అశోక చక్ర ప్రదానం చేశారు.గణతంత్ర వేడుకలకు ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిపబ్లిక్ డే వేడుకలకు ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కేంద్రమంత్రులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ఐదంచెల భద్రతను ఏర్పాటు చేశారు.

30 వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలతో భద్రత కల్పించారు. కర్తవ్యపథ్ సమీపంలో 6 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు.

## మేడారంలో తల్లుల గద్దెలమీది నుంచి ప్రాంగణంపై హెలికాప్టర్ చక్కర్లు

### -జాతర నిర్వహణలో శాఖల మధ్య సమన్వయలోపం

వరంగల్, జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : మేడారంలో గద్దెల ప్రాంగణంపై హెలికాప్టర్ చక్కర్లు వద్దని దేవాదాయ శాఖ వారించినా వినని దయనీయస్థితి నెలకొన్నది. మేడారం జాతర నిర్వహణలో శాఖల మధ్య సమన్వయలోపానికి హెలికాప్టర్ రైడ్ మచ్చుతునకగా నిలిచింది. మేడారంలో 2016 నుంచి హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి మేడారంలోని సమక్క-సారలమ్మ గద్దెల ప్రాంగణం, చిలుకలగుట్టపైకి వెళ్లకూడదని మేడారం వడ్డెలు (పూజారులు), ఆదివాసీ ప్రతినిధులు ఉన్నతాధికారులకు విన్నవించారు. ఈసారి ఆ ఆనవాయితీ తప్పిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. హనుమకొండ, ములుగు జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర పర్యాటకశాఖ 'తంబీ హెలీసంస్థ'తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా గురువారం నుంచి ఈ నెల 31 భక్తుల సేవలో రెండు హెలీకాప్లర్ట అందుబాటులోకి తెచ్చారు. హెలీరైడ్ ద్వారా మేడారం జాతర పరిసరాలను గగన వీక్షణ చేస్తున్నారు. గద్దెల ప్రాంగణం, చిలుకలగుట్ట పై నుంచి హెలీకాప్టర్ చక్కర్లు కొట్టొద్దని ఎంత వారించినా వినడంలేదని ఆదివాసీలు, పూజారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తల్లుల గద్దెలమీది నుంచి ఆ హెలీకాప్టర్ చక్కర్లు కొట్టొద్దని చెప్పండి' అని దేవాదాయ శాఖ అధికారులు 'సెట్'లో పలుమార్లు చెప్పినా ఫలితం లేకుండా పోతున్నది.

## రాష్ట్రవ్యాప్తంగా 77వ రిపబ్లిక్ డే వేడుకలు..

### - పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఎగురవేసిన గవర్నర్



హైదరాబాద్, జనవరి 26: తెలంగాణలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన పోలీసుల వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు హాజరయ్యారు.

అంతకుముందు తెలంగాణ అసెంబ్లీలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు. తెలంగాణ అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలిలో గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. ఇక తెలంగాణ సచివాలయంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అధికారులు రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు.

## జూబ్లీహిల్స్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జనవరి 26:నగరంలోని జూబ్లీహిల్స్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఈ నియోజకవర్గం నుంచి చదువుకున్న యువకుడిని నిలబెట్టి ప్రజలే గెలిపించారని పేర్కొన్నారు. రాజకీయాలు వ్యవస్థలో చాలా ముఖ్యమైనవని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్డు పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం జూబ్లీహిల్స్‌లో పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు.



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు ప్రజలకు సేవ చేయాలనే తపన ఉందని, అలాంటి నాయకుడితో కలిసి అభివృద్ధి పనులు చేయించుకోవాలని ప్రజలకు మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. భవిష్యత్తులో నవీన్ యాదవ్ పెద్ద స్థాయి నాయకుడిగా ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అంటే చాలా అభివృద్ధి చెందిన ప్రాంతమని అనుకున్నప్పటికీ, ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ నగరంలో కాలుష్యం తీవ్రంగా పెరిగిందని, పరిశ్రమలను నగరానికి దూరంగా ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉందని వెల్లడించారు. అలాగే కమలాపురి కాలనీలో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు మంత్రి.

## రాజధాని అమరావతిలో తొలిసారి రిపబ్లిక్ డే వేడుకలు



అమరావతి జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారు. రాజధాని అమరావతిలో తొలిసారి రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు. హైకోర్టు సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో ఈ వేడుకలు చేపట్టారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు, ఇతర అధికారులతో పాటు రాజధాని రైతులు కూడా పాల్గొన్నారు.అనంతరం పరేడ్‌లో పాల్గొన్న11 దళాల నుంచి గవర్నర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రగతిని చాటేలా 22 శకటాలను ప్రదర్శించారు.

## టీపీసీసీ సేవాదళ్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు



హైదరాబాద్ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా టీపీసీసీ సేవాదళ్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ లో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గీతా రెడ్డి, మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ వైస్ ఛైర్మన్ ఫేహీం ఖురేషి, బెల్లయ్య నాయక్, సేవదళ్ చైర్మన్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.రిపబ్లిక్ డే సందర్భంగా కాంగ్రెస్ నాయకులు జాతీయ నాయకులకు నివాళులు అర్పించారు..

## ఇండియాకు రిపబ్లిక్ డే విషెస్ చెప్పిన ట్రంప్.. సందేశమిదే

న్యూఢిల్లీ, జనవరి 26: 77వ గణతంత్ర వేడుకలు జరుపుకొంటున్న ఇండియాకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "77వ గణతంత్ర వేడుకలు జరుపుకొంటున్న ఇండియా ప్రజలకు, ప్రభుత్వానికి అమెరికా ప్రజల తరఫున, నా తరఫున శుభాకాంక్షలు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా, ఇండియా చారిత్రక బంధాన్ని కలిగి ఉన్నాయి" అని ట్రంప్ పేర్కొన్నారు.

ఇండియాపై టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ హెచ్చరిస్తున్నప్పటికీ ఆయన చేసిన ప్రకటన ఇరు దేశాల మధ్యగల సంబంధాన్ని తెలియజేస్తోంది. అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు అమెరికా సెక్రెటరీ మార్కో రుబియో కూడా ఇండియాకు ప్రత్యేక విషెస్ చెప్పారు. "రక్షణ, ఎనర్జీ, ఖనిజాలు, టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఎంతో ప్రగతి దోహదం పడుతోంది. ఈ సంవత్సరం కూడా మరిన్ని భాగస్వామ్యాల కోసం ఎదురు చూస్తున్నాం" అని రుబియో అన్నారు. ఇక.. ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలకు ఇండియాలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ హాజరయ్యారు.

అమెరికా తయారు చేసిన విమానం ఇండియాలో ఎగరడం చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. ఇది ఇరుదేశాల బలమైన సంబంధాలకు నిదర్శనం అని ఆయన వ్యాఖ్యానించారు. కాగా.. అమెరికా, ఇండియా మధ్య ఇంకా ట్రేడ్ వార్ కొనసాగుతోంది. ఇరు దేశాల మధ్య ట్రేడ్ డీల్ కుదరాల్సి ఉంది.

## హ్యాట్సాఫ్ దినేష్..మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం: సజ్జనార్

హైదరాబాద్ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: 'మనుషులున్నారు కానీ.. మానవత్వం ఏది?' అనే ప్రశ్నకు నిలువెత్తు నిదర్శనం దినేష్ అని హైదరాబాద్ సిపి సజ్జనార్ ప్రశంసించారు. అఫ్జల్‌గంజ్‌కు చెందిన దినేష్ ఇటీవల నాంపల్లి ఫర్నిచర్ షాపులో జరిగిన అగ్ని ప్రమాద సమయంలో చూపిన తెగువ చూస్తే.. మానవత్వం ఇంకా చనిపోలేదని ఉందనిపిస్తుందన్నారు. ఓ పక్క ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న మంటలు.. మరోపక్క బాధితుల ఆర్తనాదాలు.. అయినా దినేష్ వెనకడుగు వేయలేదని కొనియాడారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సహాయక చర్యల్లో పాల్గొన్నారని మెచ్చుకున్నారు. ప్రమాదం జరిగితే వీడియోలు తీస్తూ కాలక్షేపం చేసే ఈ రోజుల్లో.. ప్రాణాలకు తెగించి దినేష్ చేసిన సాయం నిజంగా సాహసోపేతమన్నారు. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దినేష్‌ను సత్కరించుకోవడం ఎంతో గర్వంగా ఉందని, హ్యాట్సాఫ్ అని సిపి సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు.

## అక్రిడిటేషన్ల సవరణ జీవోపై టీయూడబ్ల్యూజె హర్షం



హైదరాబాద్, జనవరి 26: ప్రభుత్వం జారీచేసిన అక్రిడిటేషన్ల జీవోపై జర్నలిస్టుల నుంచి ఆందోళన వ్యక్తం కావడంతో ప్రభుత్వం దిద్దుబాటుకు పూనుకుంది. డెస్క్ జర్నలిస్టులకు సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణ జీవో నెంబర్ 103 పై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం హర్షం వ్యక్తం చేసింది.యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ గతంలో తీసుకువచ్చిన 252 జీవో పై టీయూడబ్ల్యూజే చేసిన పోరాట ఫలితంగా జర్నలిస్టు సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవరణ జీవో తేవడం, అందులో ప్రధానంగా అందరి జర్నలిస్టుల మాదిరిగానే డెస్క్ జర్నలిస్ట్ సైతం అక్రిడిటేషన్ కార్డులే జారీచేస్తామని చేస్తున్నారని స్పష్టం చేయడం ముదావహం అన్నారు.

మండల స్థాయిలో లక్షన్నంకు పైగా జనాభా ఉన్నచోట అదనపు కార్డులు ఇస్తామని పేర్కొనడంతోపాటు కల్చరల్, స్పోర్ట్స్, సినిమా జర్నలిస్టులకు సైతం ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తానని ప్రకటించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జీవో మారడం టీయూడబ్ల్యూజే సాధించిన విజయమని పేర్కొన్నారు.

అయితే గత ప్రభుత్వ హయాంలో వచ్చిన 239 జీవో ప్రకారం వచ్చినన్ని అక్రిడేషన్ కార్డులు ఈ సవరణ జీవో అనంతరం కూడా ఆ స్థాయిలో రావడంలేదని విషయం తేటతెల్లమైందన్నారు. కార్డుల సంఖ్య భారీగా తగ్గనున్న నేపథ్యంలో ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేసి 239 జీవో ప్రకారం జారీ అయిన కార్డుల సంఖ్యనే వర్తింపచేయాలని కోరారు.

కేబుల్ చానల్స్, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు మరోసారి మొండిచెయ్యి


గతంలో రాష్ట్రస్థాయిలో కేబుల్ ఛానళ్లకు 12 కార్డులు చొప్పున ఐ అండ్ పీఆర్ ద్వారా జారీ చేశారని, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఈ సవరణ జీవోలో కేబుల్ ఛానల్స్ అంశమే లేకపోవడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు.

యూనియన్‌గా మా అభిప్రాయాన్ని చెప్పినప్పటికీ కేబుల్ ఛానల్స్ విషయంలో, నియోజకవర్గ స్థాయిలో రిపోర్టర్లకు ఇచ్చే కార్డుల విషయంలో ప్రభుత్వం స్పందించక పోవడం అన్యాయమన్నారు. ఈ విషయమై సమాచార శాఖ స్పెషల్ కమిషనర్‌ను వెంటనే కలిసి మరోమారు చర్చిస్తామని, అప్పటికీ స్పందించకపోతే ఈ రెండు అంశాలపై భవిష్యత్ కార్యాచరణ త్వరలో వెల్లడిస్తామన్నారు.

## నిజామాబాద్ ఘటన అత్యంత దురదృష్టకరం.. చట్టప్రకారం శిక్ష తప్పదు: మంత్రి దామోదర

హైదరాబాద్, జనవరి 26: నిజామాబాద్‌లో గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం పరామర్శించారు. సౌమ్యపై దాడి దురదృష్టకరమని మంత్రి విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని లక్ష్యం గా పెట్టుకున్నామని తెలిపారు. ఎక్సైజ్, పోలీస్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు మంత్రి.

ఈ క్రమంలోనే నిజామాబాద్‌లో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని రాజ నర్సింహ అన్నారు. ఇందులు కారకులైన ప్రతి ఒక్కరినీ చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. సౌమ్య ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగైనప్పటికీ.. ఇంకా ఆమె కండీషన్ క్రిటికల్‌గానే ఉందని తెలిపారు. నిమ్స్‌లో సుశిక్షితులైన సీనియర్ వైద్యుల బృందం, సౌమ్యకు అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. సౌమ్య సంపూర్ణంగా కోలుకుటుందని ఆశిస్తున్నామన్నారు.

# భూగోళ అద్భుత అందాలను అన్వేషిద్దాం ఆశ్వాదిద్దాం !

## (27 జనవరి "జాతీయ భౌగోళిక దినోత్సవం" సందర్భంగా)

సౌర కుటుంబంలో భూగోళం ఒక ప్రత్యేక గ్రహం. జీవకోటి, నీటి ఊటల సంపదల నెలవు భూమాత. ధరిణిపై అత్యద్భుతాలు ఎన్నో, చూసే అవకాశాలు లేనివి ఎన్నో. "చూడగలిగిన వారికి చూసినంత" కనుల విందును వడ్డిస్తుంది నేల తల్లి. పారే సెలయేర్లు, నీలి సముద్రాలు అలల హ్వాయలు. హరిత తివాచీలా పరిచినట్లు చెట్టు చేమలు. అపూర్వ మానవ కట్టడాలు, ఊహకందని సముద్ర జలాల పొట్టన దాగిన వింత జీవులు. జీవితాంతం చూసినా ఇంకా చూడాల్సినవే అధికం.

భౌగోళిక రహస్యాలు, అద్భుతాలను అన్వేషిస్తూ ఆసాంతం ఆశ్వాదిద్దాం:

అలాంటి భౌగోళిక సహజ, చారిత్రక, మానవ సంబంధమైన అసంఖ్యాక అంశాలను పిల్లలకు, పెద్దలకు, విద్యావేత్తలకు, చారిత్రక నిపుణులకు, పర్యాటకులకు, అన్వేషులకు అవగాహన పరచడానికి ప్రతి ఏట 27 జనవరి రోజున "జాతీయ భౌగోళిక దినోత్సవం(నేషనల్ జియోగ్రాఫిక్ డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 27 జనవరి 1888న "జాతీయ భౌగోళిక సంఘం" ఏర్పడడంతో పాటు అదే రోజు "జాతీయ భౌగోళిక మ్యాగజీన్" ప్రారంభమైన నేపథ్యానికి గుర్తుగా 27 జనవరిన ఈ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా మారింది. జాతీయ భౌగోళిక దినం–2026 ఇతివృత్తంగా "భూగ్రహ భవిష్యత్తు పరిరక్షణకు భౌగోళిక అన్వేషణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది. ఇప్పటి వరకు మనం చూడని, చూడలేని పర్యావరణ ప్రత్యేకతలు, అరుదైన జీవజాతులు, సాంస్కృతిక ఆచారవ్యవహారాలను చూసి, తరించి, జ్ఞానం పొంది జీవితాన్ని సుసంపన్నం చేసుకోవడానికి కృషి చేయాలనే అవగాహనను ప్రచారం చేయడమే ఈ దినోత్సవ ప్రత్యేకత అని అర్థం చేసుకోవాలి.

జాతీయ భౌగోళిక దినం వేదికగా మ్యూజియమ్‌ల సందర్శనం, వైజ్ఞానిక శాస్త్ర పరిజ్ఞానం, ప్రకృతి అందాల వేట, చారిత్రక ప్రదేశాల పరిచయం, మానవ వైవిధ్య సంస్కృతి సంప్రదాయాలను చర్చించడంతో పాటు చరిత్రకారులు, ప్రముఖ ఫోటోగ్రాఫర్లు, సాహసికులు, శాస్త్రవేత్తలను సముచితంగా సన్మానించడం లాంటి కార్యక్రమాలు జరగాలి. భౌగోళిక అద్భుతాలను నిరంతరం ఆవిష్కరిస్తున్న అన్వేషులను ఆరాదిద్దాం, వీలు చేసుకొని, టైమ్ చూసుకొని భౌగోళిక రహస్యాల గుట్టు విప్పుదాం.



– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 2026 సంవత్సరానికి సంబంధించిన సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార విజేతలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 26:సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారానికి సంబంధించి 2026 సంవత్సరానికి గాను, 'సంస్థాగత విభాగంలో 'సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ' (ఎస్ఎస్‌డీఎంఏ), వ్యక్తిగత విభాగంలో 'లెఫ్టినెంట్ కల్నల్ సీతా అశోక్ షెల్కే' ఎంపిక య్యారు. విపత్తు నిర్వహణలో చేసిన అద్భుతమైన కృషి చేసినందుకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును అందిస్తోంది.

విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు, సంస్థలు భారత్‌లో చేసిన అమూల్యమైన కృషి, నిస్వార్థ సేవను గుర్తించటంతో పాటు గౌరవించేందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. 'సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారం' పేరుతో ఒక వార్షిక అవార్డును ఏర్పాటు చేసింది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి అయిన జనవరి 23న ప్రతి ఏటా ఈ అవార్డును ప్రకటిస్తున్నారు.

కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా మార్గదర్శకత్వంలో దేశంలో విపత్తు నిర్వహణ పద్ధతులు, సంసిద్ధత, నివారణ, ప్రతిస్పందన యంత్రాంగాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. దీని ఫలితంగా ప్రకృతి వైపరీత్యాల సమయంలో మరణాల సంఖ్య భారీగా తగ్గింది.

2026 సంవత్సరానికి సంబంధించిన అవార్డుల కోసం 2025 మే 1 నుంచి నామినేషన్లను స్వీకరించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా 2026 అవార్డులకు విస్తృత ప్రచారం కల్పించారు. మొత్తంగా వివిధ సంస్థలు, వ్యక్తుల నుంచి మొత్తం 271 నామినేషన్లు అందాయి.

భారత సైన్యానికి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సీతా అశోక్ షెల్కే.. 2024లో కేరళలోని వయనాడ్‌లో వరదలు సంభవించటం, కొండచరియలు విరిగిపడిన సమయంలో భారీ స్థాయిలో మానవతా సహాయం, విపత్తు సహాయక (హెచ్ఏడీఆర్) పనులకు నాయకత్వం వహించారు. వేగవంతమైన తరలింపు, సహాయక సామగ్రి పంపిణీ, అత్యవసర సేవల పునరుద్ధరణను నిర్ధరించేందుకు అధికారులు, స్థానిక నాయకులతో ఆమె సమన్వయం చేసుకున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో అనేక ప్రమాదకరమైన సహాయక మిషన్లకు నాయకత్వం వహించిన లెఫ్టినెంట్ కల్నల్ సీతా అశోక్ షెల్కే.. వందలాది మందిని రక్షించారు. మారుమూల గ్రామాలకు కీలకమైన అనుసంధానాన్ని పునరుద్ధరించిన చూరల్‌మలలోని 190 అడుగుల బెయిలీ వంతెనను వేగంగా నిర్మించడాన్ని ఆమె పర్యవేక్షించారు. రాత్రివేళ కేవలం నాలుగు గంటల్లోనే తాత్కాలిక పాదచారుల వంతెనను నిర్మించడంతో పాటు 'కొమాట్సు పీసీ210' ఎక్స్‌కవేటర్‌ను బరువుకు సమతూకంగా (కౌంటర్ వేయిట్) ఉపయోగించడం వంటి వినూత్న ఇంజనీరింగ్ పరిష్కారాలను ఆమె ఉపయోగించారు.

బరువైన 150 టన్నుల పరికరాలను సమీకరించడం ద్వారా లెఫ్టినెంట్ కల్నల్ సీతా అశోక్ షెల్కే నేతృత్వంలో జరిగిన పనులు.. సమయానుకూలమైన ఉపశమనం, పునరుద్ధరణ పనుల ద్వారా వేలాది మందికి ప్రయోజనం చేకూర్చాయి. విపత్తు ప్రతిస్పందన, మానవతా కార్యకలాపాలలో 2,300 మందికి పైగా సిబ్బందికి ఆమె శిక్షణ ఇచ్చారు. ఇంజనీరింగ్ పద్ధతుల ద్వారా విపత్తు ముప్పు తగ్గింపును (డీఆర్ఆర్) ఆమె ఆచరణలోకి తీసుకువచ్చారు. సైనిక ఇంజనీరింగ్ నైపుణ్యాలను ఉపయోగించి విపత్తు ప్రభావిత మారుమూల ప్రాంతాలలో వంతెనలు, ప్రవేశ మార్గాలు, ఆశ్రయాల వేగవంతమైన నిర్మాణానికి ఆమె తోడ్పడ్డారు. ఇది సహాయక, పునరుద్ధరణ చర్యలకు ఎంతో మద్దతుగా నిలిచింది. ఆమె కృషి ఆచరణాత్మక నాయకత్వం, విపత్తు ముప్పు తగ్గింపు (డీఆర్ఆర్) కార్యకలాపాలలో పెరుగుతున్న మహిళల పాత్రను తెలియజేస్తోంది.

**సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎస్ఎస్‌డీఎంఏ) – సంస్థాగత విభాగం**

సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎస్ఎస్‌డీఎంఏ) 2005లో ఏర్పాటైంది. గ్రామ స్థాయిలో విపత్తు నిర్వహణ సహాయకులు(డీఎంఏ), బ్లాక్ స్థాయి ప్రధాన కార్యాలయాల్లో 'విపత్తు నిర్వహణ పర్యవేక్షకులు' (డీఎంఎస్), జిల్లా స్థాయి ప్రధాన కార్యాలయాల్లో 'విపత్తు నిర్వహణ సమన్వయకర్తలు' (డీఎంసీ).. ఇలా మూడు అంచెల్లో 1,185 మంది శిక్షణ పొందిన 'ఆపద మిత్ర'లను విపత్తు నిర్వహణ అధికారులుగా నియమించడం ద్వారా సిక్కింలో విపత్తు సంసిద్ధత, ప్రతిస్పందనను ఎస్ఎస్‌డీఎంఏ గణనీయంగా బలోపేతం చేసింది. విపత్తు నిర్వహణ సహాయకులను అన్ని గ్రామ పంచాయతీల్లో నియమించింది. ఇది భాగస్వామ్య ప్రణాళిక, సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు, పంచాయతీ స్థాయి కమిటీల ఏర్పాటుకు దారితీసింది. దీనివల్ల మొత్తం ఆరు జిల్లాలలో విపత్తులు, వాతావరణ ముప్పులను తట్టుకోగల సామర్థ్యం మెరుగుపడింది. 2016లో మాంతం కొండచరియలు విరిగిపడటం, 2023 లో తీస్తా నది వరదల వంటి క్లిష్ట సమయాల్లో ఎస్ఎస్‌డీఎంఏ చేపట్టిన తక్షణ (రియల్-టైమ్) సమన్వయంతో... శిక్షణ పొందిన మొదటి స్థాయి సహాయకులు.. 2,563 మందిని రక్షించడంతో పాటు ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగారు. ముందస్తు హెచ్చరికలు, సంసిద్ధత, స్థానిక సామర్థ్య పెంపుదలపై గట్టిగా దృష్టి సారించి 'ఆపద మిత్ర' ద్వారా క్రియాశీలక, సమాజ-కేంద్రీకృత విపత్తు ముప్పు తగ్గింపు (డీఆర్ఆర్) విధానాన్ని ఎస్ఎస్‌డీఎంఏ ఏర్పాటుచేసింది. ఇతర రాష్ట్రాలకు ముఖ్యంగా హిమాలయ, ఈశాన్య రాష్ట్రాలకు అనువైన సమాజ-కేంద్రీకృత విపత్తు నిర్వహణ, అనుసరణీయమైన నమూనాను ఈ సంస్థ అభివృద్ధి చేసింది.

# దారుణ హత్య..

అమరావతి, జనవరి 26: యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ జిల్లా మేఘాద్రిగడ్డ వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. నిందితులు యువకుడి ముఖంపై మద్యంసీసాలతో దాడిచేసి దారుణంగా హతమార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు.

హత్యకు గురైన యువకుడు గుంటూరుకు చెందిన కల్యాణ్ చక్రవర్తిగా నిర్ధారించారు. గత రాత్రి మేఘాద్రిగడ్డ వద్ద కొందరు యువకులు పార్టీ చేసుకున్నట్లు గుర్తించారు. సమీపంలో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా మనోజ్, వినోద్ అనే ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

# గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

యాదాద్రి జనవరి 26: గుండెపోటుతో ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ కుప్పకూలినవిషాద ఘటన తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వద్ద చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న అమరావతి బస్ డ్రైవర్ గుండెపోటుతో ప్రాణాలు విడిచారు.

చౌటుప్పల్ వద్ద బస్సును పక్కకు ఆపి సీటులోనే కుప్పకూలారు. డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడిని విజయవాడ డిపోలో పనిచేస్తున్న గొల్లపూడికి చెందిన నాగరాజుగా గుర్తించారు. బస్సును పక్కకు ఆపివేయడంతో బస్సులోని 19 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు.

# పోలీసులకు ఎమ్మెల్యే అభినందన

అమరావతి, జనవరి 26: ఈనెల 24వ తేదీన అచ్చంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన నక్సలైట్లను సమర్థవంతంగా అదుపులోకి తీసుకున్న అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్ఐ సద్దాం హుస్సేన్ లను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సోమవారం అచ్చంపేట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజా భవన్ క్యాంప్ కార్యాలయంలో అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లమల్ల ప్రాంతంలో ఎటువంటి సంఘవిద్రోహ, అసాంఘిక కార్యకలాపాలకు తావులేదని స్పష్టం చేశారు.

ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అచ్చంపేట ప్రాంతంలో నక్సలైట్ల వ్యతిరేక కార్యకలాపాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, ఎక్కడైనా అసాంఘిక చర్యలు చోటుచేసుకుంటే వెంటనే స్పందిస్తోందన్నారు. నల్లమల్ల ప్రాంతంలో దోపిడీలు, దౌర్జన్యాలు, సంఘవిద్రోహ కార్యకలాపాలకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు. ప్రశాంతంగా ఉన్న అచ్చంపేటను ఎవ్వరూ అశాంతికి గురి చేయొద్దని ఆయన సూచించారు. ఈ విషయంలో ప్రజలంతా పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఏపీలో ఫిబ్రవరి 10వరకు సర్వే

## ఏకీకృత కుటుంబ సమగ్ర సర్వే గడువును పొడిగించిన సర్కార్



అమరావతి, జనవరి 26: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్‌లో సర్వే మొదలవ్వగా.. 30 రోజుల పాటు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జనవరి 12 వరకు ఈ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ప్రభుత్వం విధించిన డెడ్‌లైన్ ముగిసినా సర్వే ఇంకా పూర్తి కాలేదు. టెక్నికల్ కారణాల వల్ల సర్వే ఆలస్యమవుతోంది. దీంతో గడువును ఫిబ్రవరి 10 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ సర్వే ద్వారా ఏపీలోని ప్రతీ కుటుంబం వివరాలు నమోదు చేయనున్నారు. ఆన్‌లైన్ విధానంలో ఈ సర్వే చేపడుతుండగా.. గ్రామాల్లో ఫోన్ సిగ్నల్స్ ఉండకపోవడం, ఇంటర్నెట్ స్పీడ్ తక్కువగా ఉండటం వల్ల వివరాలు నమోదు చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో సర్వేలో వివరాలు నమోదు చేయడం కష్టమవుతుందని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ సమగ్ర కుటుంబ సర్వేలో ఇంటింటికి వెళ్లి 20 రకాల అంశాలపై సమాచారం సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

# ఉత్తమ ఉద్యోగ అవార్డు అందుకున్న ఆర్డీఓ రమణారెడ్డి



నల్గొండ, జనవరి 26: దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి ఉత్తమ ఉద్యోగ అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, ప్రజల ఆదరాభిమానాలు పొందినందున గణతంత్ర దినోత్సవాన నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ చేతుల మీదుగా సోమవారం ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘం దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ అయ్యుబ్ ఖాన్, నాయబ్ తాసీల్దార్, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

**ఆహ్వానం**

అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ హైదరాబాద్ మరియు విశ్వసాహితి సంయుక్తంగా నిర్వహిస్తున్న

"కళాప్రపూర్ణ" "కృష్ణానంద" డాక్టర్ పోతుకుచి సాంబశివరావు గారి జయంతి మహోత్సవం మరియు కవిగాయక సమ్మేళనం

తేది : 27-1-2026, మంగళవారం ఉ॥ 10.30 గం॥లకు

వేదిక : అశోక్ నగర్ సంస్కృతి కేంద్రం, అశోక్‌నగర్, హైదరాబాద్-500020.

**సభా కార్యక్రమం**

ముఖ్య అతిథులు : డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు
సంచాలకులు, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ

సభాధ్యక్షులు : ఆచార్య కడారి సత్యమూర్తి
అధ్యక్షులు – ఎబిబిఎస్ఎస్, హైదరాబాద్

విశిష్ట అతిథులు : ఆచార్య టి. గౌరీ శంకర్ గారు
పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయము

ఆత్మీయ అతిథులు: శ్రీ బైసా దేవదాస్ గారు సంపాదకులు, నేటినిజం

కార్యక్రమ నిర్వహణ: శ్రీమతి గోళ్లమూడి పద్మావతి
అధ్యక్షులు, మహిళా విభాగం ఎబిబిఎస్ఎస్

శ్రీ ఎన్.వి. రఘువీర్ ప్రతాప్
ప్రధాన కార్యదర్శి, ఎబిబిఎస్ఎస్

**అతిథులచే కవులకు సత్కారం**

కవులు తమ పేర్లు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని మనవి)

ఫోన్ నెంబర్లు : 9618895543, 9440551552

**కార్యవర్గం :**

అఖిల భారతీయ భాష సాహిత్య సమ్మేళన్, హైదరాబాద్

# 'బోడు పరిసర ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ మెరుగుపర్చాలి'

ఖమ్మం, జనవరి 26:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని బోడు పరిసర ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సిగ్నల్ సేవలు మెరుగుపర్చాలని బోడు గ్రామస్తులు, సర్పంచ్ పొదెం స్వరూప కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎనిమిది సంవత్సరాలుగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ఇబ్బందికరంగా ఉందన్నారు. నెట్‌వర్క్ మెరుగుపర్చాలని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. కనీసం కాల్స్ మాట్లాడే పరిస్థితి లేదని, ఇంటర్నెట్ సదుపాయం అధ్వానంగా ఉందన్నారు. బోడు చుట్టూ పక్కల గ్రామాల్లో వేలాది మంది బీఎస్ఎన్ఎల్ వినియోదారులు ఉన్నారని, ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

# 'పెండింగ్ బిల్లులు చెల్లింపునకై 27న చలో ఇందిరా పార్క్'

రామగిరి, జనవరి 26 : తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల పీఆర్సీ అమలు అలాగే పెండింగ్ బిల్లుల సత్వర చెల్లింపులకై తపస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, మల్కా కొమరయ్య, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఈ నెల 27న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన 24 గంటల ధర్నాకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నల్లగొండ జిల్లా శాఖ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తిని భాస్కర్ గౌడ్, రేణికుంట్ల రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లులు సత్వరం మంజూరు చేయాలన్నారు. పీఆర్సీ అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ దీక్షకు జిల్లాలో ఉన్న పెన్షనర్లు పూర్తి మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు ఇరుగు శ్రీరాములు కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, పొనుగోటి రవీందర్ రావు, కొమిరెల్లి భాస్కర్ రెడ్డి, కంచనపల్లి విజయకుమర్, అలుగుపల్లి పాపిరెడ్డి పాల్గొన్నారు.

# మట్టయ్య చారి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

సూర్యాపేట, జనవరి 26 : సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన మట్టయ్య చారి ఇటీవల అనారోగ్యం చనిపోయారు. సోమవారం సూర్యాపేటలోని బులియన్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో మటయ్య చారి కుటుంబానికి అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయకుమార్ లక్ష 30 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టయ్య చారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ మన్నే సింహాద్రి, కోశాధికారి బర్లే మధుసూదన్, గుణగంటి రాములు, అంతటి రాములు, జిల్లేపల్లి శ్రీనివాస్, అంతటి జానీ, వెన్న నరేష్ రెడ్డి, అంతటి కృష్ణ, కక్కిరేణి శేఖర్ పాల్గొన్నారు.

# ఘనంగా ఏకేవీఆర్ కళాశాల రజతోత్సవ వేడుకలు



భీమదేవరపల్లి, జనవరి, 26 : అలిగి రెడ్డి కాశి విశ్వనాధ రెడ్డి జూనియర్ డిగ్రీ కళాశాల రజతోత్సవ వేడుకలు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సోమవారం ఘనంగా జరిగాయి. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను కళాశాల ప్రిన్సిపల్ భూపతి శ్రీకాంత్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలు విద్యా కుసుమానికి సోపానాలు అన్నారు.

కళాశాలల్లోనే జీవన గమనము, ప్రతిభ, లక్ష్యము తెలుస్తాయని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి అంతిమ లక్ష్యాలను ఛేదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ సుదర్శన్ రెడ్డి, ఎస్సై రాజు, డాక్టర్ సుధాకర్, స్థానిక సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఉపసర్పంచ్ మమత, ఎంఈఓ సునీతా రాణి, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# తుంగతుర్తిలో కంటి వైద్య శిబిరం

నల్గొండ, జనవరి 26: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మెడి విజన్ కంటి ఆస్పత్రి హైదరాబాద్ సహకారంతో తుంగతుర్తి మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పాలవరపు సంతోష్ మాట్లాడుతూ.. పేదలు, వెనుకబడిన మారుమూల ప్రాంత ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వ్యక్తులు ఆరోగ్యశ్రీ కార్డు గానీ హెల్త్ కార్డు గాని కలిగి ఉంటే తామే ఆపరేషన్ చేసే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి పులుసు ఉప్పలయ్య, దుగ్యాల మాధవరావు, కాసం మల్లయ్య, మౌలా సుధాకర్ రెడ్డి, మెడి విజన్ కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# భారతదేశం అత్యంత యువ దేశాలలో ఒకటిగా నిలుస్తోంది

## – కేంద్ర సహాయ మంత్రి శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ




న్యూఢిల్లీ, జనవరి 26:దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో 18వ రోజ్ గార్ మేళా నిర్వహించారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి ఎంపికైన కొత్త అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో బాధ్యతలు నిర్వహించనున్నారు. ఉద్యోగ కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనే ప్రధానమంత్రి నిబద్ధతను కార్యరూపంలోకి తీసుకురావడానికి 'రోజ్ గార్ మేళా' ఒక ముఖ్యమైన చొరవ. ఇది ప్రారంభమైనప్పటి నుంచి దేశవ్యాప్తంగా 11 లక్షలకు పైగా నియామక పత్రాలను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని, వివిధ శాఖలకు చెందిన 392 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా 18వ రోజ్ గార్ మేళాను ఉద్దేశించి ప్రసంగించారు. 2026వ సంవత్సరం ప్రజల జీవితాల్లో కొత్త సంతోషాన్ని తీసుకురావడంతో పాటు పౌరులను వారి రాజ్యాంగ విధులతో అనుసంధానిస్తూ ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. ఈ విశిష్టమైన రోజున 61 వేల మందికి పైగా యువత ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను అందుకోవడం ద్వారా తమ జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారని ఆయన అన్నారు. ఈ నియామక పత్రాలను దేశ నిర్మాణానికి ఆహ్వానంగా మరియు అభివృద్ధి చెందిన భారత నిర్మాణాన్ని వేగవంతం చేసే ప్రతిజ్ఞగా ప్రధానమంత్రి అభివర్ణించారు. కొత్తగా చేరిన యువత జాతీయ భద్రతను బలోపేతం చేయడంలో, విద్య మరియు ఆరోగ్య వ్యవస్థను శక్తివంతం చేయడంలో, ఆర్థిక సేవలు మరియు ఇంధన భద్రతను మెరుగుపరచడంలో, అలాగే ప్రభుత్వ రంగ సంస్థల వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యువతందరికీ ఆయన తన హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

యువతకు నైపుణ్యాలను పెంపొందించడం మరియు వారికి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని మోదీ స్పష్టం చేశారు. ప్రభుత్వ నియామకాలను 'మిషన్ మోడ్'లో నిర్వహించడానికి ప్రారంభించిన రోజ్ గార్ మేళా, కాలక్రమేణా ఒక బలమైన వ్యవస్థగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ చొరవ ద్వారా లక్షలాది మంది యువత వివిధ ప్రభుత్వ విభాగాల లో నియామక పత్రాలను పొందారని ఆయన గుర్తు చేశారు. ఈ మిషన్‌ను మరింత ముందుకు తీసుకెళ్తూ, నేడు దేశవ్యాప్తంగా 40కి పైగా ప్రాంతాల్లో రోజ్ గార్ మేళా జరుగుతోందని వివరిస్తూ, అక్కడ ఉన్న యువతను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

విశాఖపట్నంలో జరిగిన సభను ఉద్దేశించి కేంద్ర సహాయ మంత్రి శ్రీ భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే అత్యంత యువ దేశాలలో ఒకటిగా ఉందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉందని, 'మిషన్ మోడ్' డ్రైవ్‌ల ద్వారా నియామక ప్రక్రియను వేగవంతం చేసిందని ఆయన తెలిపారు. రోజ్ గార్ మేళా ఒక వ్యవస్థగా మారి నియామకాలను క్రమబద్ధీకరించడమే కాకుండా యువతకు పారదర్శకతను అందిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంఎస్ఎంఈ రంగం ప్రోత్సాహంతో పాటు 'మేక్ ఇన్ ఇండియా', 'మేడ్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడం దేశ ఆర్థిక అభివృద్ధికి దోహద పడుతోందని ఆయన వివరించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు దేశానికి గౌరవంతో, చిత్తశుద్ధితో సేవ చేయాలని మరి యు దేశ నిర్మాణ ప్రయాణంలో చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐఎస్ ఎఫ్ యూనిట్ సీనియర్ అధికా రులు శ్రీ ఎస్.ఆర్. శరవణన్ డాక్టర్ ఎం.జి. రాఘవేంద్ర కుమార్ విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కార్యదర్శి శ్రీ డి. రమణ మూర్తి, సీనియర్ కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పాయ్ మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకున్న ఈసీఐ

న్యూఢిల్లీ, జనవరి 26: 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని భారత ఎన్నికల సంఘం రేపు న్యూఢిల్లీలో నిర్వహించనుంది. 'నా దేశం, నా ఓటు' అనే ఇతివృత్తంతో జరగనున్న ఈ ఏడాది వేడుకలకు 'భారత ప్రజాస్వామ్యానికి కేంద్రబిందువు పౌరుడు' అనేది నినాదం.

న్యూఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై అధ్యక్షత వహించనున్నారు. కేంద్ర న్యాయశాఖ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్ గౌరవ అతిథిగా పాల్గొంటారు. ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషిలతో కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహిస్తారు.

ముందుగా భారత రాష్ట్రపతి ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారు. కొత్తగా నమోదైన యువ ఓటర్లకు ఫోటో గుర్తింపు కార్డులను అందజేస్తారు. అలాగే సాంకేతికత పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, ఎన్నికల నిర్వహణ, వినూత్న ఓటర్ల అవగాహన, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, శిక్షణ,సామర్థ్య పెంపు వంటి వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ఉత్తమ ఎన్నికల ప్రాక్టీసెస్ అవార్డులను, ఇతర ప్రత్యేక అవార్డులను, మీడియాకు ప్రత్యేక అవార్డులను కూడా రాష్ట్రపతి ప్రధానం చేస్తారు.

ఎన్‌వీడీ 2026 సందర్భంగా రెండు ప్రచురణలను కూడా ఆవిష్కరించనున్నారు. అవి 2025: ఎ ఇయర్ ఆఫ్ ఇనిషియేటివ్స్ అండ్ ఇన్నోవేషన్స్ ,బీహార్‌లో సార్వత్రిక ఎన్నికల విజయవంతంగా నిర్వహించడంపై రూపొందించిన 'చునావ్ కా పర్వ్, బిహార్ కా గర్వ్'. ఎన్నికల నిర్వహణ, ప్రజాస్వామ్య అభివృద్ధిలో భారత ఎన్నికల సంఘం అంతర్జాతీయ నాయకత్వాన్ని ప్రతిబింబించే వీడియోను కూడా ఈ సందర్భంగా ప్రదర్శిస్తారు.

ఎన్నికల జాబితాల తయారీ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలను ప్రదర్శించేందుకు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఓటర్ల ప్రయోజనం కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ఇటీవలి కార్యక్రమాలు, 2025లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన తీరును కూడా ఈ ప్రదర్శనలో ప్రధానంగా చూపిస్తారు.

జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రధాన ఎన్నికల అధికారులు (సీఈఓలు), జిల్లా ఎన్నికల అధికారుల (డీఈఓలు) కార్యాలయాల ద్వారా ఏకకాలంలో నిర్వహిస్తారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) కూడా వారి పోలింగ్ కేంద్రాల వద్ద కార్యక్రమాలను ఏర్పాటు చేసి, కొత్తగా నమోదైన ఓటర్లను సత్కరించి, గుర్తింపు కార్డులను అందజేస్తారు.

# చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో 18వ విడత ఉద్యోగ మేళా




న్యూఢిల్లీ, జనవరి 26:కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించే ప్రయత్నాల్లో భాగంగా అన్ని మంత్రిత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడానికి నిర్దిష్ట కాలపరిమితితో నియామక ప్రక్రియలను చేపడుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి తెలిపారు.

హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో గల సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో నిర్వహించిన 18వ విడత ఉద్యోగ మేళాలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాల్లో నియామక ప్రక్రియ క్రమబద్ధీకరణ, వేగవంతం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు 2022 నుంచి రోజ్‌గార్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. "కొత్తగా ఉద్యోగాల్లో నియమితులైన యువత వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తారు" అని ఆయన అన్నారు.

ప్రభుత్వ రంగంలో ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా... అంకుర సంస్థలను ప్రోత్సహించడం, కొత్త పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి కల్పనను పెంచడంపై కేంద్రం దృష్టి సారించిందని ఆయన తెలిపారు. "ప్రస్తుత ప్రపంచ అనిశ్చితుల మధ్య ప్రపంచ దేశాలకు భారత్ నమ్మకమైన గమ్యస్థానంగా ఉంది. ఆయా దేశాల నుంచి వచ్చే కొత్త పెట్టుబడులు మన దేశంలో ఉద్యోగాలను సృష్టించడంలో సహాయపడతాయి" అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 213 మంది అభ్యర్థులకు కేంద్ర మంత్రి నియామక పత్రాలను అందజేశారు. సీఆర్‌పీఎఫ్‌లో 179, ఎస్ఎస్‌బీలో 5, ఐటీబీపీలో 16, బీఎస్ఎఫ్‌లో 5, ఐఎఫ్ఎల్‌యూలో 1, ఐఐటీ-హైదరాబాద్‌లో 3, బ్యాంక్ ఆఫ్ బరోడాలో 1, విద్యా మంత్రిత్వ శాఖలో 3 ప్రొఫెసర్ పోస్టులు వీటిలో భాగంగా ఉన్నాయి. ఉద్యోగం పొందిన వారిలో 15 మంది మహిళలు ఉన్నారు.

సౌత్ జోన్ మెడికల్ ఐజీ గణేష్ చంద్ర పాడి, హైదరాబాద్ సెంటర్ డీఐజీ ఉదయ భాస్కర్ బిల్లా, కమాండెంట్ మోహన్ దాస్ కోబ్రుగాడే సహా సీనియర్ సీఆర్‌పీఎఫ్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 18వ రోజ్‌గార్ మేళాను దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో నిర్వహించారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి కొత్తగా నియమితులైన 61,000 మంది అభ్యర్థులు... హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, ఉన్నత విద్యా విభాగం సహా భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో చేరనున్నారు.

# దేశభక్తిని జాగృతం చేసిన భారీ తిరంగా ర్యాలీ




హైదరాబాద్, జనవరి 26:లయన్ జిల్లా 320జీ పక్షాన ఆల్ఫోర్స్ మహిళ కళాశాలలయన్ వి రవీణదర్ రెడ్డి, లయన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, లయన్ ఇనుగుర్తి రమేశ్ సమన్వయకర్తలుగా శాతవాహన లయన్స్ క్లబ్, లియో క్లబ్ ఆఫ్ ఆల్ఫోర్స్ మహిళా కళాశాల నేతృత్వంలో కరీనంగర్ పురవీధుల్లో నిర్వహించిన 100 మీటర్ల భారీ తిరంగా ర్యాలీ నగరవాసుల్లో దేశభక్తిని జాగృతం చేసింది. తెలంగాణ చౌక్ వద్ద తిరంగా ర్యాలీని జిల్లా గవర్నర్ లయన్ ఎస్ కోదండరామ్ జెండా ఊపి ప్రారంభించగా, ప్రథమ ఉప గవర్నకర్ లయన్ ఎం భద్రేశం, జిల్లా కార్యదర్శి లయన్ వాసుదేవ్ రెడ్డి, జిల్లా కోశాధికారి లయన్ జి వెంకట్‌లతో పాటు నగర క్లబ్బుల సభ్యులు, ఆల్ఫోర్స్ మహిళా కళాశాలకు చెందిన 100 మంది లియో సభ్యులు పాల్గొని తెలంగాణ చౌక్ నుంచి టవర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం టవర్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగిరేసి, జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపించారు. ర్యాలీలో పలు దేశభక్తికి చెందిన వినాదాలతో నగర రోడ్లు మారుమోగాయి.

# పాఠశాలల అభివృద్ధి కోసం సహకారం అందిస్తాం

## –సర్పంచ్ బండారు కవిత స్వామిగౌడ్



మెదక్, జనవరి 26: గ్రామాభివృద్ధితోపాటు పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తొగుట మండలంలోని వెంకట్రావుపేట సర్పంచ్ బండారు కవిత స్వామిగౌడ్ తెలిపారు. 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకట్రావుపేట గ్రామపంచాయతీ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక, జిల్లాపరిషత్ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన డెస్కులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డెస్కుల ఏర్పాటు కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఏర్పాటులో ముందుకు వచ్చిన పంచాయతీ కార్యదర్శి రవీందర్‌ను ఆమె అభినందించారు. పాఠశాల నుండి పలు పోటీలలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరుస్తున్న విద్యార్థులకు బహుమతులు అందించారు.

ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు నహీమా కౌసర్, వెంకటయ్యలు, ప్రముఖ కవి బండకాడి అంజయ్య గౌడ్, ఉప సర్పంచ్ లచోల్ల లింగం, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కారు బీభత్సం.. మహిళ మృతి

అమరావతి, జనవరి 26: కారు బీభత్సం సృష్టించడంతో ఒక మహిళ మృతిచెందగా, మరో మహిళకు గాయాలైన ఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరు సీతారామరాజు జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని చింతపల్లి మండలంలోని పెంటపాడులో కారు వ్యాపారులపైకి దూసుకెళ్లింది. మహిళ మృతిచెందగా, మరో మహిళకు గాయాలయ్యాయి. కారు డ్రైవర్ విజయకుమార్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.

# పోస్టల్ శాఖలో 28,740 ఉద్యోగాలు...

## -టెన్త్ మార్కుల ఆధారంగానే ఎంపిక... పరీక్ష లేదు...!

హైదరాబాద్ జనవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పోస్టల్ శాఖలో 28,740 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు.టెన్త్ మార్కుల ఆధారంగానే ఎంపిక... పరీక్ష లేదు...!మొత్తం ఖాళీలు: 28,740 (అంచనా)తెలంగాణ: 519 పోస్టులుఆంధ్రప్రదేశ్: 1,215 పోస్టులుపోస్టుల పేర్లు: గ్రామీణ డాక్ సేవక్ (ఉఆూ), బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (ఃఖఓ), అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ (ంఃఖఓ).ఎంపిక విధానం: ఎటువంటి రాత పరీక్ష ఉండదు. అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల (మెరిట్) ఆధారంగా ఎంపిక చేస్తారు. విద్యార్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.వయోపరిమితి: అభ్యర్థుల వయస్సు 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. (నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయో సడలింపు ఉంటుంది).నోటిఫికేషన్ ఉ దరఖాస్తు ప్రారంభం: జనవరి 31, 2026.దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 14, 2026.మెరిట్ లిస్ట్ విడుదల: ఫిబ్రవరి 28, 2026. రూ. 12,000/- నుంచి రూ. 29,380/- వరకు. రూ. 10,000/- నుండి రూ. 24, 470/- వరకు.జనరల్/ఓబీసీ అభ్యర్థులకు: రూ. 100/-ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/మహిళలకు: ఫీజు లేదు.ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 31 నుంచి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష లేకుండా ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు ఇది ఒక సువర్ణావకాశం

# స్నేహశీలి చింతల వీరయ్య

## – మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



నల్గొండ, జనవరి 26:కోదాడ కాన్వాసింగ్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చింతల వీరయ్య స్నేహశీలి అని, అందరినీ ఆప్యాయంగా పలకరించే వారు అని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందిన చింతల వీరయ్య అంత్యక్రియలో ఆయన పాల్గొని పాడె మోశారు. దశాబ్ద కాలంగా వీరయ్య కుటుంబంతో తనకు అవ్యాజానుబంధం ఉందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. అంత్యక్రియల్లో పలు పార్టీల నాయకులు పారసీతయ గట్ల కోటేశ్వరరావు, రఘు, వెంపటి మధు, తొగరు రమేష్, చల్లా ప్రకాష్, రషీద్, రామయ్య పాల్గొన్నారు.

# ఆటలతోనే ఆరోగ్యం, ఐక్యమత్యం

## -మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్

ఖమ్మం, జనవరి 26: ఆటలతో ఆరోగ్యంతో పాటు ఐకమత్యం బలపడుతుందని వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. సోమవారం కారేపల్లి మండల పరిధిలోని తోడితలగూడెం సర్పంచ్ బానోత్ ప్రియాంక కుమార్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల స్థాయి క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆటలు ఆడడం ద్వారా ఆరోగ్యం గా ఉండటమే కాకుండా మానసిక శారీరక దృఢంగా ఉంటారన్నారు. గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తి చాటుకోవటం ముఖ్యమని క్రీడాకారులకు సూచించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ప్రియాంక కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మీర వీరన్న, భూక్యా రాం కిషోర్, వాంకుడోత్ విజయ్, గుగులోతు హరు. రవి, రాహుల్, సుజాత, కళ్యాణ్, సుధాకర్, థామస్ పాల్గొన్నారు.

కళానిలయం సాంస్కృతిక సంఘ సేవా సంస్థ Regd. 6284 శ్రీ త్యాగరాయ గానసభ (ప్రపంచ రికార్డులు పొందిన ఆడిటోరియం)
యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని
ఫణి భార్గవ్ యాదిలో...
ప్రతిభా పురస్కారం
దీప్తి వాజ్‌పేయి గారు డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్, టి.వి.9
శ్రీ ప్రవీణ్ కలవల గారు క్రైమ్ బ్యూరో చీఫ్, ఎ.బి.ఎన్. ఆంధ్ర జ్యోతి
ఆర్థిక సహకారం
కుమారి యం. రాజేశ్వరి బి.కాం. విద్యార్థిని
కుమారి పి. రక్షిత బి.కాం. విద్యార్థిని
సాయిబాబ సామాజిక కార్యకర్త



జీవిత సాఫల్య సత్కారం: శ్రీ అన్నె అచ్యుతరామయ్య గారు (100 సం॥) సీనియర్ నాయకులు (సి.పి.యం.)
ముఖ్యఅతిథి :
డా॥ కె.వి. రమణాచారి గారు IAS (Retd.) తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు
ఆత్మీయ అతిథి :
డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు సంచాలకులు భాషా సాంస్కృతిక శాఖ
సభాప్రారంభకులు :
శ్రీ కళా వి.యస్. జనార్ధన్ మూర్తి గారు అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
సభాధ్యక్షులు :
డా॥ యం.కె. రాము గారు పూర్వ సంచాలకులు, జవహర్ బాలభవన్, రచయిత
గౌరవ అతిథి :
శ్రీ బైస దేవదాసు గారు సంపాదకులు, నేటినిజం దినపత్రిక
శ్రీమతి ప్రవల్లిక నృత్య గురువు, శిష్య బృందంచే నృత్య కార్యక్రమాలు
శ్రీమతి సుష్మా ఉదయ్‌మహంతి నృత్య గురువు, శిష్య బృందంచే నృత్య కార్యక్రమాలు
శ్రీ శ్యామ్ లలితగీతాల గానం
27-01-2026 సా॥ 5.00 గం॥లకు, వేదిక : కళాసుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి.
శ్రీమతి కళాశారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి త్యాగరాయ గానసభ
ఎ.సురేందర్, స్థాపక కార్యదర్శి 9550512032
శ్రీమతి ఎ. పుష్పలత అధ్యక్షులు

# సంజీవని ప్రాజెక్టు అమలు

## -ఫిబ్రవరి నుంచి జిల్లా వ్యాప్తంగా..
## -ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకం రూ.25 లక్షలకు పెంపు
## -అభివృద్ధి సంక్షేమంలో జిల్లా అగ్రగామి
## -గణతంత్ర దినోత్సవ వేడుకలలో కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి




చిత్తూరు, జనవరి 26:చిత్తూరు జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ తుషార్ దుడి పాల్గొన్నారు. జాతీయ పతాకావిష్కరణకు ముందు జాతిపిత మహాత్మా గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు జిల్లా కలెక్టర్, ఎస్పీ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

అనంతరం మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ప్రత్యేక పరిశీలన వాహనంలో పోలీస్ పరేడ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత గణతంత్ర దినోత్సవం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలు, భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, విలువలు మనందరికీ శాశ్వత మార్గదర్శకాలని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకనుగుణంగా సమిష్టి కృషితో చిత్తూరు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నామని స్పష్టం చేశారు.

ఆరోగ్య రంగంలో సంజీవని ప్రాజెక్ట్ ఒక కీలకమైన, విప్లవాత్మక ముందడుగుగా నిలుస్తోందని కలెక్టర్ వెల్లడించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి మొదటి వారం నుంచి జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు అధికారులు పూర్తిగా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రోగుల వైద్య చరిత్రను పూర్తిగా డిజిటల్ రూపంలో భద్రపరచి, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఒకే విధమైన వైద్య సమాచారం అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

దీని వల్ల రోగులు ఆసుపత్రులు మారినప్పటికీ వైద్య వివరాలు తక్షణమే లభించి, చికిత్సలో జాప్యం తగ్గడంతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని వివరించారు. అదేవిధంగా పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకాన్ని మరింత బలోపేతం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ పథకం కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని చెప్పారు.

జిల్లాలో ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 1,08,631 మంది లబ్ధిదారులకు రూ.203 కోట్ల విలువైన వైద్య సేవలు అందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వంతో పాటు ఎంపిక చేసిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా నాణ్యమైన చికిత్స అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంగా జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మహిళా సాధికారత దిశగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం ద్వారా జిల్లాలో కోటి మందికి పైగా మహిళలు లబ్ధి పొందారని, ఇప్పటి వరకు సుమారు రూ.39 కోట్ల మేర రవాణా చార్జీలు ఆదా అయ్యాయని వివరించారు.

సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లను రూ.4,000కు పెంచి, 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి వరకు జిల్లాలో రూ.1,117.50 కోట్లను పింఛన్ల రూపంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యారంగంలో తల్లికి వందనం పథకం ద్వారా రూ.335 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశామని, మెగా డీఎస్సీ ద్వారా 1,394 మంది ఉపాధ్యాయుల నియామకాలు పూర్తి చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. గృహ నిర్మాణంలో పీఎంఏవై పథకం కింద జిల్లాలో 53,723 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. తాగునీరు, రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి హామీ పథకాల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించినట్లు వివరించారు.

ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న జిల్లా అధికారులకు, సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు, మీడియా ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, పూతలపట్టు మురళీమోహన్, జీడి నెల్లూరు థామస్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, ఎమ్మార్వో కులశేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 28 నుంచి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు..

యాదగిరిగుట్ట జనవరి 25 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ ప్రసిద్ధి క్షేత్రమైన యాదాద్రి ఆలయ అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా తొలి రోజైన శనివారం ఉదయం ఆలయంలో నిత్యారాధనల అనంతరం తిరుమంజనంను శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం తొళక్కముతో ప్రారంభించి దివ్య ప్రబంధ సేవాకాలమును పారాయణికులు వేదోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ జె.వినోద్‌రెడ్డితో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు అధ్యయ నోత్సవాల విశిష్టతను వివరించారు.

### 28 నుంచి బ్రహ్మోత్సవాలు..

ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల కోసం ఆలయ అధికారులు ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు చేశారు. 28న స్వస్తివాచనంతో ప్రారంభంకానున్న ఉత్సవాలు 3వ తేదీన అష్టోత్తర శత ఘటాభిషేకంతో ముగియనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 30న రాత్రి 7.30 గంటలకు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, 31న రాత్రి 7.30 గంటలకు స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవం, వచ్చే నెల 1వ తేదీన రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం జరగనున్నట్లు తెలిపారు.

### ఉత్సవాల కోసం ప్రత్యేక అధికారి గా వినోద్‌రెడ్డి

పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ జి.వినోద్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా శనివారం ప్రారంభమైన అధ్యయనోత్సవాలలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచలు చేశారు.

# అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

## -ఎస్పీ సునీల్ షొరాణ్




నంద్యాల, జనవరి 26: బ్రిటిష్ పాలకుల నుంచి దేశాన్ని కాపాడిన త్యాగ వీరులు అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ సునీల్ షేరన్ పేర్కొన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ కుటుంబ సమేతంగా హాజరై ఘనంగా నిర్వహించడం జరిగింది. జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం పోలీసు కార్యాలయ సిబ్బందికి, పరిపాలన ఉద్యోగులకు మిఠాయిలు పంచి పెడుతూ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. అనంతరం విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలను అందించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ తోపాటు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్ సురేష్ బాబు ఆర్ఎస్ఐ కాళీ చరణ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శాఖలవారీగా బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: శాఖల వారీగా బడ్జెట్ సన్నాహక సమావేశాలు మొదలు కానున్నాయి. ఈ సమావేశాలకు ఆయా శాఖల మంత్రులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భేటీ కానున్నారు. ప్రస్తుతం శాఖలవారీగా బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ప్రభుత్వ శాఖల ప్రగతి పద్దు, నిర్వహణ పద్దుకు సంబంధించి అంచనాలను ప్రాథమికంగా తయారు చేసింది. ఈ అంచనాలపై సచివాలయంలో రాష్ట్ర బడ్జెట్ 2026 సన్నాహక సమావేశాలు జరగనున్నాయి. సంబంధిత మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, శాఖాధిపతులు పాల్గొననున్నారు. ఫిబ్రవరి 5 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. రోజుకు రెండు సెషన్లలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంటకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు సమావేశాలు సాగుతాయి. ఇందుకు సంబంధించి భట్టి ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల వారీగా ఖరారు చేసిన సమీక్షల షెడ్యూల్‌ను శాఖలకు స్పష్టం చేశారు. పూర్తిస్థాయి బడ్జెట్ రూపకల్పనలో భాగంగా ఆర్థిక శాఖ ఇప్పటికే అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు కోరారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి సంబంధించి ఆయా శాఖల పనితీరు సూచికల ఆధారంగా నిర్దేశించిన లక్ష్యాల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. బడ్జెట్ సన్నాహక సమావేశాల్లో ప్రభుత్వ శాఖలు రూపొందించిన అంచనాల ఆధారంగా చర్చిస్తారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు, డిమాండ్‌కు అనుగుణంగా కేటాయింపులకు ప్రాధాన్యం ఇస్తారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలకు అనుగుణంగా కొత్తగా అమలు చేయాల్సిన పథకాలపైనా చర్చించనున్నారు. పాత పథకాలకు బడ్జెట్ డిమాండ్‌తో పాటు కొత్త పథకాలకు బడ్జెట్‌పై అవసరాలపై అంచనాకు రానున్నారు. పురపాలన, పట్టణాభివృద్ధి శాఖతోపాటు సాధారణ పరిపాలన విభాగం, హోమ్, లా అండ్ ఆర్డర్, న్యాయ తదితర శాఖలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యవేక్షణలో కొనసాగుతుండడంతో ఆయా సమావేశాలకు సీఎం అధ్యక్షత వహిస్తారు. సమీక్షల అనంతరం కేంద్ర బడ్జెట్ ఆధారంగా రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనల్లో మార్పులు చేస్తారు. అనంతరం బడ్జెట్ సమావేశాలు : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రభుత్వం ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలో మున్సిపల్ ఎన్నికలూ జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత ఫిబ్రవరి నాలుగో వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనుంది. ఆ బడ్జెట్ ఆధారంగా కేంద్రం నుంచి వివిధ పథకాలు, కార్యక్రమాలకు ఏమేరకు నిధులు వస్తాయన్నది అంచనా వేసి 2026- 27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించనుంది. ఫిబ్రవరి చివరి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

# చక్కటి జీవనశైలిని పాటించడం వల్ల డయాబెటిస్ ను తిప్పికొట్టవచ్చు




హైదరాబాద్ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వయసుతో సంబంధం లేకుండా ప్రస్తుతం అందరినీ డయాబెటిస్ ఇబ్బందులకు గురి చేస్తోంది. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి అనేక కారణాల వల్ల డయాబెటిస్ బారిన పడుతున్నారు. ఇది దీర్ఘకాలం పాటు ఉండే అనారోగ్య సమస్య. అంతేకాకుండా ఒక్కసారి ఈ అనారోగ్య సమస్య బారిన పడితే జీవితాంతం మందులు మింగుతూ ఈ సమస్యతో బాధపడాల్సిందే అని అందరికి తెలిసిందే. అయితే క్రమశిక్షణ కలిగిన ఆహారం, వ్యాయామం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించుకుని డయాబెటిస్ నుండి బయటపడవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు. కాలక్రమేణా డయాబెటిస్ తీవ్రమవుతుందే తప్ప తగ్గదు అని భావించే వారు చక్కటి జీవనశైలిని పాటించడం వల్ల డయాబెటిస్ ను తిప్పికొట్టవచ్చని వారు చెబుతున్నారు.

### పిండి పదార్థాలను తగ్గించాలి..

డయాబెటిస్ తో బాధపడే వారు ముఖ్యంగా అల్పాహారంలో కార్బోహైడ్రేట్లను స్థిరంగా తీసుకుంటూ ఉండాలి. రక్తంలో చక్కెర పెరుగుదలను నివారించడానికి ప్రతి భోజనానికి సుమారు 60 గ్రాముల కార్బోహైడ్రేట్స్ ను మాత్రమే తీసుకోవాలి. వీటితో పాటు ఆకుకూరలు, కాయధాన్యాలు, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరంలో చక్కెర శోషణ మందగిస్తుంది. ఆహారంతో పాటు డయాబెటిస్ తో బాధపడే వారు వ్యాయామం చేయడం కూడా చాలా సులభం. వ్యాయామం చేయడం వల్ల గ్లూకోజ్ ను శరీరం సమర్థవంతంగా గ్రహించగలదు. డయాబెటిస్ తో బాధపడే వారు కార్డియో చేయడం కంటే బరువులు ఎత్తడం, శరీర బరువు వ్యాయామాలు చేయడం డయాబెటిస్ ను తగ్గించడంలో ప్రభావవంతంగా పని చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

### వ్యాయామం..

క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, చక్కటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ పై ఆధారపడకుండానే డయాబెటిస్ ను తగ్గించుకోవచ్చని వారు సూచిస్తున్నారు. నిర్మాణాత్మక జీవనశైలి మార్పులు మన ఆరోగ్యంలో చాలా పెద్ద తేడాను తీసుకువస్తాయని ఇవి మొత్తం శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. డయాబెటిస్ రివర్సల్ అనేది నిపుణుల పర్యవేక్షణలో చేయడం మంచిది అని సలహా ఇస్తున్నారు. ఇది అందరికీ వర్తించదని ప్రారంభదశలో ఉన్న వారు దీనిని పాటించడం వల్ల ఉపశమనం కలుగుతుందని అయితే దీర్ఘకాలం పాటు డయాబెటిస్ ఉండడంతో పాటు తీవ్రంగా ఉన్నవారు డయాబెటిస్ నుండి పూర్తిగా బయటపడకపోవచ్చని వారు చెబుతున్నారు .డయాబెటిస్ తో బాధపడే వారు ముందుగా రోజువారి అలవాట్లతో ప్రారంభించి అలాగే స్థిరంగా ఉండడం వల్ల మందులను కూడా నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్ కు ఖరీదైన మందులు వాడే వారు చక్కటి జీవనశైలిని, ఆహార నియమాలను పాటించడం, వ్యాయామం చేయడం వల్ల డయాబెటిస్ తగ్గడంతో పాటు మందుల వాడకం కూడా తగ్గించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్

## -మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి.. కేటీఆర్ పిలుపు



హైదరాబాద్ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోను సీఎం రేవంత్ రెడ్డి తుంగలో తొక్కుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అనేక అబద్ధాలు, అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను పక్కన పెట్టారు, పరిపాలన వదిలేశారని మండిపడ్డారు. చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేత, మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి తన అనుచరులతో కలిసి ఇవాళ బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ గులాబీ కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇలా హామీలిచ్చి అందర్నీ మోసం చేస్తుందని ఆనాడే చెప్పామని.. అన్నట్లుగానే రెండేళ్లలో రేవంత్ రెడ్డి ఏ ఒక్క వర్గాన్ని వదిలిపెట్టకుండా అందర్నీ మోసం చేశాడని తెలిపారు. వృద్ధుల నుంచి మొదలు ఆడబిడ్డల వరకు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు.. ఇలా అందర్నీ రేవంత్ రెడ్డి మోసం చేస్తానే ఉన్నాడని అన్నారు. కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న అన్ని వర్గాలు ఈరోజు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. సనసభ స్పీకర్ ధృతరాష్ట్రుని లెక్క మారాడని.. కళ్ళకు గంతలు కట్టుకొని నిజాలు చూడలేకపోతున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో ,చేరి కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉంటే స్పీకర్ మాత్రం గుర్తించడం లేదని విమర్శించారు. యాదయ్య ఇంకా భారత రాష్ట్ర సమితిలోనే ఉన్నాడని చెబుతున్నాడని పేర్కొన్నారు. కాలె యాదయ్య గెలిపించిన పార్టీని వదిలిపెట్టి పదవుల కోసం, పైసల కోసం కాంగ్రెస్ పార్టీలోకి పోయాడని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని యాదయ్య చెబుతున్నారు.. కానీ స్పీకరే ఒప్పుకోవడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే తమ పార్టీలో చేరిన కాలె యాదయ్యపై చర్యలు తీసుకొని.. ఎన్నికలకు పోవాలని డిమాండ్ చేశారు.

# మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంపై రూల్స్ మార్పులు చేసిన ప్రభుత్వం..

హైదరాబాద్, జనవరి 26, మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఇక నుంచి మహిళలు జీరో టికెట్ పొందేందుకు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డులు లాంటి ప్రభుత్వ గుర్తింపు ధృవీకరణ పత్రాలను చూపించాల్సిన అవసరం లేదు. ఇప్పటివరకు మహిళల ఆధార్ కార్డులను చెక్ చేసి కండక్టర్లు జీరో టికెట్ జారీ చేస్తున్నారు. అయితే ఆధార్ కార్డుల్లో పాత ఫొటోలు ఉండటంతో మహిళలను గుర్తించడం కండక్టర్లకు కష్టతరంగా మారింది. దీంతో కండక్టర్లు, మహిళల మధ్య వాగ్వాదాలు జరుగుతున్న సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. దీనికి చెక్ పెట్టి మహిళలు సులభతరంగా బస్సుల్లో ప్రయాణించేందుకు కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం మహిళలకు ప్రత్యేక ఐడీ కార్డులను ఇవ్వనుంది. త్వరలో రాష్ట్రంలోని మహిళలందరికీ మహాలక్ష్మి ఐడీ కార్డను పంపిణీ చేయనుంది. మహిళలు బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం పొందేందుకు ఇవి ఒక ఐడీ కార్డులా ఉపయోగపడతాయి. ఈ కార్డులపై మహిళ ఫొటోతో పాటు పేరు, గ్రామం, మండలం, జిల్లా వంటి అడ్రస్ వివరాలు పొందుపర్చి ఉంటాయి. అలాగే ఈ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్తో పాటు అత్యాధునిక చిప్ ఉంటుంది. కండక్టర్ల వద్ద ఉండే మెషిన్ స్మార్ట్ కార్డులపై ఉండే చిప్పు స్కాన్ చేయగానే ప్రయాణ వివరాలు నమోదవుతాయి. దీని వల్ల మహిళలు ఆధార్ కార్డును చూపించాల్సిన అవసరం లేదు. తమ దగ్గర ఆధార్ కార్డును క్యారీ చేయాల్సిన పని ఉండదు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా సులువుగా మహిళలు ప్రయాణం చేయవచ్చు. ప్రతీ ఒక్క వ్యక్తికి ఆధార్ ప్రత్యేక నెంబర్ ఉన్నట్లుగానే.. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రతీ మహిళకు ఒక 16 అంకెల విశిష్ట నెంబర్ను కేటాయిస్తారు. కార్డు ముందు భాగంలో మహిళ ఫొటో, అడ్రస్ వివరాలు ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల తయారీ ఇప్పటికే ప్రారంభమవ్వగా.. త్వరలో ముద్రణ పూర్తి కానుంది. కార్డుల తయారీ కోసం రూ.75 కోట్ల నిధులను ఆర్టీసీకి ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్రంలోని 1.5 కోట్ల మంది మహిళలకు కార్డులు అందించనున్నారు. తొలుత 5 లక్షల కార్డులను పైలట్ ప్రాజెక్ట్ కింద జారీ చేయనుండగా.. ఆ తర్వాత మిగతా లబ్దిదారులకు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి అందరి వివరాలు గతంలో సేకరించింది. ఈ వివరాల ఆధారంగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ లబ్దిదారులను ఎంపిక చేసే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది.

# మధుసూదన్ రెడ్డి మృతి తీరని లోటు..

## -కేంద్రమంత్రి గంగపురం కిషన్ రెడ్డి



అమరావతి, జనవరి 26: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి మరణం బీజేపీ పార్టీకి తీరని లోటని కేంద్ర మంత్రి గంగపురం కిషన్ రెడ్డి అన్నారు. ఇవాళ వంగ మధుసూదన్ రెడ్డి నివాసానికి వచ్చి మధుసూదన్ రెడ్డి కుమారుడు సిద్ధార్థ రెడ్డి, ఆయన సతీమణి పద్మజ, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఆయన మరణం ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రజలకు తీరని లోటన్నారు. పార్టీ కోసం, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి ఆయన అన్నారు. పరామర్శించిన వారిలో రంగారెడ్డి జిల్లా అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాసరెడ్డి, మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, కళ్లెం రవీందర్ రెడ్డి, చంపాపేట బీజేపీ అధ్యక్షులు పోరెడ్డి రవీందర్ రెడ్డి, సద్ది సందీప్ రెడ్డి, దశరథ్ గౌడ్, రాంపురం శ్రీనివాస్, చిలువేరు అనిల్ కుమార్, రమేష్ రెడ్డి, తదితరులున్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి పునరంకితమవుదాం

## -బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్‌రావు గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు

హైదరాబాద్ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారత 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. భారత పౌరులకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించే దిశగా భారతదేశం గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిన పండుగ వేళ ఈ రోజు అని కేటీఆర్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అడుగుజాడల్లో.. దేశంలో రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి పునరంకితమవుదామని గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతినబూనుదామని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని రూకల్పన చేసిన మహానుభావుల దూరదృష్టిని, వారు మనకు అప్పగించిన విలువలను స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నదని హరీశ్‌రావు అన్నారు.

# ప్రోటీన్లు కావాలంటే నాన్ వెజ్ తినాల్సిన పనిలేదు..



హైదరాబాద్ జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మన శరీరానికి ప్రోటీన్ చాలా అవసరం. కండరాల నిర్మాణంలో, జుట్టు ఆరోగ్యానికి, కణాల మరమ్మత్తుకు, రోగనిరోధక శక్తికి మద్దతు ఇవ్వడంలో, హార్మోన్ల తయారీకి ఇలా అనేక రకాలుగా ప్రోటీన్ మనకు అవసరమవుతుంది. చికెన్ బ్రెస్ట్, గుడ్లు, చేపలు వంటి ఆహారాల్లో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. అయితే శాకాహారులకు మాత్రం ప్రోటీన్ ను తీసుకోవడం ఎల్లప్పుడూ ఒక సవాలే అని చెప్పవచ్చు. కానీ శాకాహారులు కూడా ప్రోటీన్ ను తీసుకునే విషయంలో రాజీ పడాల్సిన అవసరం లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్ కలిగిన మొక్క ఆధారిత ఆహారాలు మన శరీరానికి రెట్టింపు ప్రయోజనాలను అందిస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. మొక్క ఆధారిత ప్రోటీన్ వనరులను తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగుల ఆరోగ్యంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

పచ్చి బఠానీలను తింటే..

శరీరానికి ప్రోటీన్ ను అందించే సరైన వనరులను ఎంచుకోవడం ద్వారం ప్రోటీన్ అవసరాలను తీర్చుకోవడంతో పాటు మైక్రోబయోమ్ ను కూడా పోషించవచ్చు. మొక్క ఆధారిత ఆహారాలను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన పోషకాలను కూడా అందించవచ్చు. అంతేకాకుండా ఇవి ఫైటోన్యూట్రియెంట్లు, యాంటీ ఆక్సిడెంట్లను కూడా కలిగి ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. మన శరీరానికి ప్రోటీన్ ను అందించే కొన్ని మొక్క ఆధారిత ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. శాకాహారులు పచ్చిబఠాణీలను తీసుకోవడం వల్ల శరీరానికి కావల్సిన ప్రోటీన్ ను పొందవచ్చు. అరకప్పు పచ్చిబఠాణీని తీసుకోవడం వల్ల 5 గ్రాముల ప్రోటీన్ ను పొందవచ్చు. అలాగే వీటిలో విటమిన్ కె, ఫైబర్, జింక్ వంటి పోషకాలు కూడా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు కూడా ఎంతో మేలు కలుగుతుంది. కూరలు, ఫ్రైడ్ రైస్ వంటి వాటిల్లో పచ్చిబఠాణీని చేర్చడం వల్ల రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా పొందవచ్చు.

సోయాబీన్స్ కూడా..

అలాగే సోయాబీన్స్ లో కూడా ప్రోటీన్ ఎక్కువగా ఉంటుంది. అరకప్పు సోయాబీన్స్ గింజల్లో 9 గ్రాముల ప్రోటీన్, 4 గ్రాముల ఫైబర్ ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల పొట్ట ఆరోగ్యం మెరుగుపడుతుంది. సోయాబీన్స్ ఐసోఫ్లేవోన్ లను కలిగి ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల బిఫిడో బాక్టీరియా, లాక్టోబాసిల్లస్ వంటి మేలు చేసే బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. అంతేకాకుండా సోయాబీన్స్ ను తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గుతాయని వైద్యులు తెలియజేస్తున్నారు. ఒక కప్పు ఓట్స్ లో 10గ్రాముల ప్రోటీన్, 8 గ్రాముల ఫైబర్ ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. జీర్ణవ్యవస్థకు కూడా ఇవి ఎంతో మేలు చేస్తాయి.

ఇతర ఆహారాలు..

అదే విధంగా శాకాహారులు సోయాబీన్స్ తో తయారు చేసిన టెంపేను కూడా తీసుకోవచ్చు. 100గ్రాముల టెంపేలో 19గ్రాముల ప్రోటీన్, 6 గ్రాముల ఫైబర్ ఉంటాయి. దీన్ని పులియబెట్టి తయారు చేస్తారు కనుక పేగు ఆరోగ్యానికి దోహదపడుతుంది. అదే విధంగా కాయధాన్యాలను తీసుకోవడం ద్వారా కూడా మనం తగినంత ప్రోటీన్ ను పొందవచ్చు. కేవలం అరకప్పు కాయధాన్యాల్లో 9గ్రాముల ప్రోటీన్, 8 గ్రాముల ఫైబర్ ఉంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల పేగు ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన ఇతర పోషకాలు కూడా లభిస్తాయి. ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల శాకాహారులు కూడా తగినంత ప్రోటీన్ ను పొందవచ్చు. అంతేకాకుండా వీటిని తీసుకోవడం వల్ల జీర్ణ ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు శరీర ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుందని పోషకాహార వైద్యులు తెలియజేస్తున్నారు.

## వేములవాడలో కృష్ణవేణి టాలెంట్ సంస్థలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

రాజన్న సిరిసిల్ల, జనవరి 26: నేటినిజం (ప్రతినిధి): రాజన్న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మెయిన్, సరస్వతి బ్లాక్, నంది కమాన్ బ్రాంచి లో విద్యార్థులు జాతీయ జెండాలతో పట్టణంలో ఊరేగింపుగా తరలివెళ్లారు. దేశభక్తి నినాదాలతో సాగిన ఈ ర్యాలీ పట్టణ ప్రజల్లో దేశాభిమానాన్ని రగిలించింది. అనంతరం పాఠశాల ఆవరణలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, సరస్వతి బ్లాక్ సన్నిధి వెంకట కృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకుని, దేశ అభివృద్ధి లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి. విద్యార్థులే రేపటి భారతదేశ భవిష్యత్తు కావున క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సన్నిధి వెంకట కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

# వేములవాడ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా.

-జెండాను ఆవిష్కరించిన ముస్లిం టౌన్ కమిటీ ప్రధాన కార్యదర్శి షాహిద్ పాషా.



రాజన్న సిరిసిల్ల, జనవరి 26: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని అర్బా మసీద్ దగ్గర ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రిపబ్లిక్ డే ను పురస్కరించుకొని వేములవాడ ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి షాహిద్ పాషా మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగం రచించి తమ హక్కుల సాధన కోసం పోరాటం చేసే ఆయుధాన్ని భారత పౌరులకు ఇచ్చారని తెలియజేశారు. విన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశం మన దేశం అని తెలిపారు. కుల మత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా ఉంటేనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. విన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశం మన దేశమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మస్జిద్ కమిటీ సదర్లు, ముస్లిం మైనారిటీ నాయకులు, పత్రిక విలేకరులు, ముస్లిం టౌన్ కమిటీ నాయకులు, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

– జాతీయ జెండాను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ శాఖలపై ప్రసంగం
ఆకట్టుకున్న విద్యార్థులు నృత్యాలు
– పలువురు లబ్దిదారులకు పరికరాల పంపిణీ



రాజన్న సిరిసిల్ల, జనవరి 26: నేటినిజం (ప్రతినిధి): గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా క్యాంప్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి నేరుగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ ల నుంచి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశ భక్తి గీతాలపై విద్యార్థుల నృత్యాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పోలీస్ శాఖ, చేనేత జౌళి శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, అగ్నిమాపక శాఖ, ఎస్డీఆర్ఎఫ్, వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో తమ తమ శాఖల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్ళను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ కలిసి పరిశీలించారు. వాటి వివరాలను ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, చేనేత ఒ జౌళి శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, ఆర్ అండ్ బీ, అగ్నిమాపక శాఖ, రోడ్డు రవాణా శాఖ శకటాలు పూర్తి వివరాలతో అద్భుతంగా తీర్చిదిద్దగా, విశేషంగా ఆకట్టుకుంది. దివ్యాంగుల కోసం స్కూటీ రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ పలువురు విద్యార్థులకు ల్యాప్ టాప్, 5జీ స్మార్ట్ ఫోన్ పంపిణీ చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంఘ రోడ్డు భద్రతకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. ఉత్తమ శకటాలు ప్రదర్శించిన శాఖల అధికారులు, విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఉత్తమ ప్రతిభ చూపిన వివిధ శాఖలకు చెందిన 273 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా విచ్చేసిన అందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఇటీవలే మన జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు అందరి సహకారంతో సజావుగా నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డ్ మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపారు. రైతు భరోసా, రుణ మాఫీ రైతు భరోసా పథకం కింద 149 కోట్ల 27 లక్షల రూపాయలు లక్ష 26 వేల 278 మంది రైతులకు ఇవ్వడం జరిగినది. రైతు రుణ మాఫీ పథకం ద్వారా 46 వేల 492 రైతులకు.. 370 కోట్ల 75 లక్షల రూపాయల లాభం చేకూరిందన్నారు. మహాలక్ష్మి పథకం మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 3 కోట్ల 59 లక్షల జీరో టికెట్లపై మహిళలు ఉచిత ప్రయాణం చేశారనీ, ఆహార భద్రతా కార్డు కలిగి ఉన్న కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయబడుచున్నదన్నారు. జిల్లాలో 93 వేల 104 కుటుంబాలు లబ్ది పొందుచున్నారని తెలిపారం ఇందిరా మహిళా శక్తి ఇందిరా మహిళా శక్తి కింద వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలలో మెప్మా ద్వారా 2 కోట్ల 10 లక్షలతో 102 ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని, తొమ్మిది మండల సమాఖ్యల ద్వారా బస్సులను ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం జరిగినది. 2 వేల 837 స్వయం సహాయక బృందాలకు 382 కోట్ల 97 లక్షల తో బ్యాంక్ లింకేజీ రుణాలు ఇప్పించడం జరిగిందన్నారు. అర్హత గల మైనారిటీ మహిళలకు మొదటి విడతగా 495 కుట్టు మిషన్లు పంపిణీ చేయడం జరిగినదన్నారు. గృహ జ్యోతి ఈ పథకం కింద మార్చి 2024 నుంచి డిసెంబర్ 2025 వరకు 21 లక్షల 65 వేల 626 జీరో బిల్లులు జారీ చేసి, 84 కోట్ల 32 లక్షల రూపాయలను చెల్లించడం జరిగిందన్నారు.

## రక్తదానం మహాదానం ప్రాణదానంతో సమానం

-రక్తదానమునకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలి

విశాఖపట్నం జనవరి 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీ ఒక్కరూ రక్తదానమునకు ముందుకు రావాలని విశాఖ ద్వారక నగర్ లోని ఎంఎస్ఎంఈ ఫోకస్డ్ ఎన్ బీఎఫ్‌సీ 'సారథి ఫైనాన్స్' ఆధ్వర్యంలో రక్తదానముకు పిలుపునిచ్చారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలపై దృష్టి సారించే నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ 'సారథి ఫైనాన్స్' ఆధ్వర్యంలో విశాఖపట్నంలో సామాజిక బాధ్యతతో కూడిన రక్తదాన శిబిరం నిర్వహించబడింది. సంస్థ చేపట్టిన దేశ వ్యాప్త సామాజిక కార్యక్రమాలలో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరానికి రక్తదానం చేసేందుకు చాలా మంది దాతలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఒకరి రక్తదానం ద్వారా 6 గురి వ్యక్తులను ప్రాణాపాయం నుండి కాపాడవచ్చన్నారు. రక్తం నుండి ప్లాస్మా, ప్లేట్ లెట్లు, ఎర్ర,తెల్ల రక్త కణాలు వంటి కంపోనెంట్లు అందించవచ్చన్నారు. దాదాపు 10 లీటర్ల రక్తాన్ని సేకరించి, స్థానిక ఆసుపత్రుల అవసరాల కోసం మరియు రక్త నిల్వల కొరతను తీర్చడానికి అందజేశారు. స్థానిక ఆరోగ్య వ్యవస్థలకు మద్దతుగా సారథి ఫైనాన్స్ దేశవ్యాప్తంగా ఆరు వేర్వేరు నగరాల్లో ఇటువంటి డ్రైవ్‌లను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, కస్టమర్లు, భాగసాౠములు మరియు స్థానిక నివాసితులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# వేములవాడ కోర్టులో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

– జెండా ఆవిష్కరణ చేసిన సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్
క్రీడాకారులకు బహుమతులు అందజేసిన సీనియర్ సివిల్ జడ్జి



రాజన్న సిరిసిల్ల, జనవరి 26: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ కోర్టులో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్ జెండా ఆవిష్కరణ చేసి వందనం చేశారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ భారత రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య పరిరక్షణలో న్యాయవ్యవస్థ పాత్రపై ప్రసంగించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది దేశభక్తి నినాదాలతో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన న్యాయవాదులు కోర్టు సిబ్బందికి బహుమతులను సీనియర్ సివిల్ జడ్జి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, క్రీడల కార్యదర్శి గుజ్జె మనోహర్, అడిషనల్ పిపి అవధూత రజనీ కాంత్, ఏజీపీలు బొడ్డు ప్రశాంత్ కుమార్, పుప్పాల భాను కృష్ణ, సీనియర్, జూనియర్ న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


# కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జనవరి 26: నేటినిజం (ప్రతినిధి): కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ లో ఘనంగా 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్వతంత్ర సమరయోధుల వేషధారణతో అందరిని ఆకట్టుకున్నారుకిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ ప్రిన్సిపల్ ధరక్షన్ వసూపియా జెండా పతాక ఆవిష్కరణ చేశారు అనంతరం దేశభక్తి గేయాలు పాడారు, గణతంత్ర దినోత్సవం పై ఉపన్యాసాలు ఇచ్చారు అనంతరం ఆటల పోటీలలో బహుమతులు గెలుచుకున్న వారికి వేములవాడ సబ్ రిజిస్టర్ విజయ్ భాస్కర్, కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్ చేతుల మీదగా బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు తదుపరి విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు

# ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయం

-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జనవరి 26: నేటినిజం (ప్రతినిధి): ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమ ధ్యేయంగా ముందుకు పోతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని శత్రజ్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.. అనంతరం అంబేద్కర్ సంఘంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం ధ్యేయంగా ముందుకు పోతుందని అన్నారు.. ఇప్పటికే నిర్మాణలు శరవేగంగా జరుగుతున్నాయి తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకున్న వారు సంతోషంగా తాము పదిలంగా అల్లుకున్న ఇందిరమ్మ ఇల్లు అనీ ఆనందంతో అంటున్నారని విప్ పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఆనాడు చేసినట్లుగా నేడూ గృహ ప్రవేశ సమయంలో నూతన వస్త్రాలు పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేములవాడలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. వేములవాడ పట్టణాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా, టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

# వేములవాడ పోలీసుల ఉత్తమ సేవలకు ప్రశంశ పత్రాలు



రాజన్న సిరిసిల్ల, జనవరి 26: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ రూరల్ పోలీస్ ల ఉత్తమ పనితీరు కు గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ మహేష్ బి గితే మరియు జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ గారు ప్రశంసా పత్రాలు అందించారు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వేములవాడ రూరల్ ఎస్ ఐ వెంకట్రాజం, కానిస్టేబుల్ లు రాజశేఖర్, తిరుపతి, వెంకటేష్ ల ఉత్తమ పని తీరుకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.





హైదరాబాద్, జనవరి 26:హోవర్డ్ మోడల్ స్కూల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలుహోవర్డ్ మోడల్ స్కూల్లో 76వ గణతంత్ర దినోత్సవాన్ని దేశభక్తి, గర్వంతో ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. భారత రాజ్యాంగ విలువలను ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రసంగాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్న తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకలు అందరిలో ఐక్యత, బాధ్యత మరియు జాతీయ గర్వభావాన్ని పెంపొందించాయి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com